క్లుప్తంగా

నేడు ఉగాది సంబరాలు

కడియం: స్థానిక బాధ్యత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) తెలిపారు. స్థానిక హైస్కూల్లోని గిరజాల కృష్ణారావు కళావేదికపై ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తెలుగు పంచాంగ శ్రవణం అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి తన తండ్రి, దివంగత కృష్ణారావు పేరిట సేవా పురస్కారాలను అందిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

సీటీఆర్ఐ: చట్టాలపై, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ఎంజే ప్రకాష్ అన్నారు. స్థానిక విజ్ఞేశ్వర కాలనీలో శనివారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ ప్రివెన్సన్ కంట్రోల్ యూనిట్ సహకారంతో చేంజెస్ ప్రివెంటేషన్ యూనిట్ డైరెక్టర్ కె.పుష్పకుమారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉందన్నారు. న్యాయవాది ప్రేమ్ వెంకటసాయి మాట్లాడుతూ విద్యా హక్కు, ఆరోగ్య హక్కు, తగిన జీవన ప్రమాణాల హక్కు, సామాజిక భద్రత హక్కు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశాకుమారి, ఏఆర్‌టీ మెడికల్ అధికారి డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి ధైర్యమే ఆయుధం

కంబాలచెరువు: సమస్య పరిష్కారానికి ధైర్యమే ఆయుధమని 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం పోక్సో, నల్సా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాచారాలు, అసభ్యకరమైన ప్రవర్తనపై చిన్నారులు భయపడకుండా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

కృష్ణకుమారి సేవలు అభినందనీయం


పదోన్నతిపై వెళుతున్న కృష్ణకుమారిని అభినందిస్తున్న సహోద్యోగులు

కడియం: స్థానిక పీహెచ్‌సీలో మహిళా హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేసి పీహెచ్‌ఎన్‌గా పదోన్నతి పొందిన జీవీ కృష్ణకుమారి సేవలు అభినందనీయమని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి మణిజ్యోత్స్న అన్నారు. కడియం పంచాయతీ కార్యాలయంలో శనివారం కృష్ణకుమారి అభినందన సభ నిర్వహించారు. పదోన్నతిలో భాగంగా శంఖవరానికి బదిలీపై వెళుతున్న ఆమెను సహోద్యోగులు, ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు నాగసాయిమౌర్య, సిబ్బంది ఎం.రామకృష్ణ, విల్సన్‌పాల్, మురళి, మూర్తి, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు కుర్చీల వితరణ

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అధ్యాపకులు 50 కుర్చీలను వితరణ చేశారు. అధ్యాపకులు డాక్టర్ డీవీ నాగేశ్వరరావు (ఎకనామిక్స్), డాక్టర్ ఎం.సుధామయి (తెలుగు), బి.మాధవ్ (కెమిస్ట్రీ), ఎస్‌డీ మదీనా (కామర్స్) వీటిని సమకూర్చారు.

సినిమాలు



శ్యామల	: రాబిన్‌హుడ్
సూర్యమినీ	: ఎల్2ఎంపురాన్
సూర్యప్యాలెస్	: మ్యాడ్ స్క్వేర్
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: రాబిన్‌హుడ్
అనుశ్రీ	: వీరధీరశూర
రాజా	: రాబిన్‌హుడ్
ఊర్వశి	: ఎల్2ఎంపురాన్
మేనక	: దిల్ రూబా
రంభ	: కోర్ట్
కుమారి	: మ్యాడ్ స్క్వేర్
అప్సర	: మ్యాడ్ స్క్వేర్
అశోక	: మ్యాడ్ స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: రాబిన్‌హుడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మ్యాడ్ స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: మ్యాడ్ స్క్వేర్

మూగజీవుల సేవలో..

- దాహార్తిని తీర్చుతున్న జైన్ సేవాసమితి
- ఐదేళ్లుగా నీటి కుండీల పంపిణీ
- నగరంలోని ప్రతి వీధిలోనూ ఏర్పాటు


మూగజీవుల కోసం నీళ్ల కుండీలు పంపిణీ చేస్తున్న జైన్ సేవాసమితి సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనిమీద బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత నీరు తాగితే గానీ ఉపశమనం లభించడం లేదు. మనుష్యులకు దాహం వేస్తే వెంటనే ఫ్రిడ్జ్‌లో వాటర్ బాటిల్ తీసుకుని నీరు తాగడమో, షాపులో కొనుగోలు చేసి దాహం తీర్చుకోవడమో చేస్తారు. కానీ మూగజీవుల మాటేమిటి. ఎండ కారణంగా నీరు లభించక తీవ్ర ఇబ్బందులు పడతాయి. ఈ సమస్య పరిష్కారానికి జైన్ సేవాసమితి ముందుకు వచ్చింది. మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నీటి కుండీలను ప్రజలకు పంపిణీ చేస్తోంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఈ కుండీలలో నీటిని పెడితే మూగజీవుల దాహం తీరుతుందని వారి ఆలోచన.

ఐదేళ్లుగా పంపిణీ

పశువులు, పక్షులు, శునకాలు తదితర వాటి కోసం జైన్ సేవాసమితి ఐదేళ్లుగా నీటి కుండీల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. మొదట్లో 500 నుంచి ప్రారంభమైన కుండీల పంపిణీ ఇప్పుడు వెయ్యికి పెరిగింది. జైన్ సంఘం సహకారంతో జైన్ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

ప్రతి వీధిలోనూ ఉండేలా..

రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంత ప్రజలకు వెయ్యి చిన్నా పెద్ద కుండీలను జైన్ సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. పశువులు, పక్షుల కోసం వేర్వేరు సైజుల్లో వీటిని పంపిణీ చేశారు. నగరంలో ప్రతి వీధిలోనూ వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజూ కుండీలను కడిగి మంచి నీరు పట్టాలని, అలాగే తీసుకువెళ్లిన కుండీలలో మొక్కలు పెంచొద్దని కోరారు.


కుండీలో నీటిని తాగుతున్న ఆవు


ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన కుండీలో నీటిని తాగుతున్న శునకాలు

వాటర్ బౌల్స్ డిస్ట్రిబ్యూషన్ గ్రూప్

వాటర్ బౌల్స్ డిస్ట్రిబ్యూషన్ 2025 వాట్సప్ గ్రూప్‌లో సభ్యులుగా చేరిన తర్వాతే జైన్ సేవా సమితి సభ్యులు కుండీలను అందజేశారు. తీసుకువెళ్లినవారు కుండీలో మంచినీరు నింపి, దాన్ని పెట్టిన ప్రదేశం ఫొటో తీసి వాట్సప్ గ్రూప్‌లో అప్ లోడ్ చేయాలి. అప్పుడే కుండీల పంపిణీకి ఒక సార్థకతతో పాటు పశువులు, పక్షుల దాహార్తి తీరుతుందని వారి నమ్మకం. ఆ విధంగానే సభ్యులందరూ గ్రూప్‌లో కుండీల్లో నీటిని తాగుతున్న పశువులు, కుక్కలు, పక్షుల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు.

దాహార్తి తీర్చేందుకే..



మూగజీవుల దాహార్తిని తీర్చేందుకే జైన్ సంఘం ఆధ్వర్యంలో జైన్ సేవా సమితి నీళ్ల కుండీల పంపిణీ చేపట్టింది. బతుకు – బతకనివ్వు అనే సందేశాన్ని అనుసరిస్తూ ఐదేళ్లుగా కుండీలను పంపిణీ చేస్తున్నాం. అందరి సహకారంతో మూగజీవుల దాహార్తిని తీరుస్తుండడం ఆనందంగా ఉంది.

– విక్రమ్ జైన్, జైన్ సేవా సమితి అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

సేవలు అభినందనీయం



జైన్ సేవా సమితి నీళ్ల కుండీలు పంపిణీ చేయడం అభినందనీయం. రెండేళ్ల క్రితం నీటి కుండీని పట్టుకుని వెళ్లి మూగజీవులకు నీళ్లు పెట్టడం జరుగుతుంది. వీటి ద్వారా మూగజీవుల దాహార్తి తీరుతుంది. వేసవి నేపథ్యంలో వాటిని నీరు అందించడం మనందరి బాధ్యతగా భావించాలి.

– కర్రి కాశీ విశ్వనాథ్, మెరకవీధి, రాజమహేంద్రవరం

పన్ను వసూలు కౌంటర్లకు సెలవు లేదు


సచివాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పన్ను వసూలు కౌంటర్లు ఆది, సోమవారాల్లోనూ పనిచేస్తాయని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రకాశం నగర్‌లోని 14వ సచివాలయంలో ఏర్పాటు చేసిన పన్ను వసూలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండగలు ఉన్నప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్నందున పన్ను వసూళ్ల కౌంటర్లను తెరిచి ఉంచుతామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం, ట్రెజరీ, నగరంలోని ఏడు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లతో పాటు హౌసింగ్ బోర్డులోని సచివాలయం–1 (పాత పంచాయతీ ఆఫీసు) కౌంటర్ యథాతథంగా పనిచేస్తుందన్నారు.

శలాకకు ఉగాది పురస్కారం


శలాక రఘునాథ శర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ శలాక రఘునాథ శర్మ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం కళారత్నకు ఎంపిక అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయం నుంచి ఆయనకు వర్తమానం అందింది. ఉగాది సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారం శలాక అందుకోనున్నారు. అనంతపురం విశ్వ విద్యాలయంలో తెలుగు శాఖ డీన్‌గా సేవలు అందించిన శలాక. పదవీ విరమణ అనంతరం రాజమహేంద్రవరంలో స్థిర పడ్డారు.

రవి పరస ఎంపిక



సీటీఆర్ఐ: నఖ చిత్రకారుడు డాక్టర్ రవి పరసకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయం నుంచి ఆయనకు వర్తమానం అందింది. ఉగాది సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. కాగా.. రవి పరస ఇప్పటి వరకూ 63 వేల చిత్రాలు తన గోటితో వేసి ప్రపంచంలోని సుమారు ఐదువేలమంది నఖ చిత్రకారులలో మొదటి స్థానంలో ఉన్నారు. ఇప్పటికి 324 అవార్డులు, 17 బిరుదులు, మూడుసార్లు స్వర్ణ కంకణ పురస్కారాలు అందుకున్నారు.

మత సామరస్యానికి ప్రతీక


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్ రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. మెయిన్ రోడ్డులోని చిన్న మసీదులో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మీయ ఇఫ్తార్ విందు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రంజాన్ మాసం సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్, బిలాల్ మస్జిద్ కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా అందరూ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మతసామరస్యానికి, సోదర భావానికి ఇఫ్తార్ విందు ప్రతీక అన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బాబు

కడియం: మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, ఆకర్షణల వైపు అడుగు వేయక చదువుపై దృష్టిపెట్టాలని, చుట్టుపక్కల వారిని గుడ్డిగా నమ్మొద్దని జిల్లా ఏడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.బాబు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పి.బాబు మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలని, ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. అంతకు ముందు ఎస్ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బాలికా రక్షణ చట్టాలను గురించి వివరించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి వంగా హారిక ఉపన్యాసం ఆకట్టుకుంది. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ రచించి, ఆలపించిన కవిత అలరించింది. హారిక, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మేజిస్ట్రేట్ బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రామాయణంపై విద్యార్థులకు పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ధవళేశ్వరం: శ్రీరామనవమిని పురస్కరించుకుని వివేకానంద మిత్రమండలి సభ్యులు రామాయణంపై శనివారం ధవళేశ్వరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. రామాయణం నుంచి తయారు చేసిన ప్రశ్నావళితో పరీక్షలు జరిగాయి. ఈ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని పరీక్షల నిర్వాహకుడు, యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావు, ఒంటిద్దు స్వామి తెలిపారు. విజేతలకు శ్రీరామనవమి రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గుజ్జుల సూర్యనారాయణ, డి శ్రీనివాసు, ఎ.సత్యనారాయణ, ముళ్లపూడి భవాని పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి


ఏఈఓల సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ విస్తరణ అధికారులు తమ బాధ్యతలను గుర్తించి రైతులకు సేవ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రచురించిన నూతన డైరీని శనివారం సాయంత్రం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. రైతు విశిష్ట సమోదు, ఈ పంట రేఖలను పర్యవేక్షించాలన్నారు. పంట కోత ప్రయోగాల దిగుబడులను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షులు డి.వేణుమాధవరావు, జిల్లా సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఉపాధ్యక్షులు మల్లికార్జునరావు, కోశాధికారి రామతులసి, ఏఈఓ సంఘ ప్రతినిధులు పీటర్, నానిబాబు, ప్రేమ్‌చంద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు కుమార్ మృతి


బోడపాటి కుమార్ (ఫైల్)


కుమార్ భౌతికకాయం వద్ద జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకుడు బోడపాటి కుమార్ (78) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు వ్యక్తిగత కార్యదర్శిగా సుదీర్ఘకాలం ఆయన పని చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చురుగ్గా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆకట్టుకున్న ఉగాది వేడుకలు



ఉగాది పచ్చడి విశిష్టతను తెలుపుతున్న విద్యార్థినులు

ధవళేశ్వరం: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో శనివారం నిర్వహించిన ఉగాది వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు సందడి చేశారు. అష్టావధానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థినులు స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అంగర రమేష్, ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, ఎస్.దీపిక, జి.విమలారోజి పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

కంబాలచెరువు: విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని పోలీసు అధికారులు తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం శక్తి యాప్, ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులందరూ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, తద్వారా పోలీస్ తక్షణ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో 4వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.సాయి సుధ, జూనియర్ సివిల్ జడ్జి, డీఎస్పీ (సెంట్రల్ జోన్) కె.రమేష్ బాబు, డీఎస్పీ (సౌత్ జోన్) ఎస్.భవ్య కిషోరి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.మంగాదేవి పాల్గొన్నారు.

‘నన్నయ’లో ఉగాది పురస్కారాల ప్రదానం

రాజానగరం: విశ్వావసు నామ సంవత్సర ప్రారంభం సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య జార్జి విక్టర్‌కు ఉగాది పురస్కారాన్ని అందించి, యూనివర్సిటీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జార్జి విక్టర్ దంపతులను సత్కరించి, జ్ఞాపిక, సన్మాన పత్రికను అందజేశారు. యూనివర్సిటీలో వివిధ విభాగాలలో విశిష్ట సేవలందించిన వీజీఆర్ శేఖర్, పీపీ రవికిరణ్, కె.శివరంజని, షేక్ బాబ్జీ, పి.ప్రేమచంద్, కె.దేవలాల్, ఎంసీహెచ్. దుర్గారావు, పి.గోవిందరాజులు, పి.సోమరాజు, ఎస్.దుర్గాప్రసాద్, బి.రాఘవులు, పి.శ్రీను, ఎస్.నాగేశ్వరరావు, యు.శ్రీనుబాబు, ఎ.కిరణ్ కుమార్, పి.వీరలక్ష్మి, వై.దుర్గాప్రసాద్, బి.నరసింహమూర్తి, ఎండీ మల్లిక, షేక్ బేబీ, పి.రాజీవ్, జి.సూర్యకుమారి, కరీం తదితరులను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కడియంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జెండా ఆవిష్కరించారు. వేమగిరి, కడియపులంక, దుళ్ల, మురమండ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించాలి

కంబాలచెరువు: ప్రభుత్వ పరంగా అందుతున్న సేవలపై మారుమూల ప్రాంతాల ప్రజలందరికీ ప్రజా వినియోగ సేవలను అందించే సంస్థలు (పబ్లిక్ యుటిలిటీ కంపెనీలు) అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు కార్యాలయ ఆవరణలోని శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంధం సునీత, పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి హాజరయ్యారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉండే సాధారణ ప్రజలకు సామాజిక న్యాయం కోసం పారా లీగల్ బృందాలు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. పారా లీగల్ వలంటీర్ల కోసం, శాశ్వత లోక్ అదాలత్ బృందాలకు సంస్థాగత నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.